దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి

డీఐ రామకృష్ణ



టపాసుల దుకాణదారులతో మాట్లాడుతున్న డీఐ రామకృష్ణ

అడ్డగుట్ట: దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని లాలాగూడ డీఐ రామకృష్ణ సూచించారు. శనివారం లాలాగూడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో టపాసుల దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా డీఐ రామకృష్ణ, ఎస్ఐ అమర్ సింగ్‌లు మాట్లాడుతూ దుకాణదారులు షాపుల వద్ద తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ పాటించాలని, ఇసుక, వాటర్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదే విధంగా ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు.

టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోండి

సరోజినిదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డా. రవీందర్‌గౌడ్



సనత్‌నగర్: దీపావళి పండుగ వేళ టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సరోజినిదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డా.రవీందర్‌గౌడ్ వివరించారు.


- విశాలమైన మైదానంలో టపాసులు కాల్చడం శ్రేయస్కరం. బక్కెట్ నీళ్ల దగ్గర పెట్టుకుని టపాసులు కాల్చాలి. టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.
- పిల్లలు శాశ్వతంగా అంధులు కాకుండా తల్లిదండ్రులే బాధ్యత తీసుకోవాలి.
- ఢిల్లీ ప్రభుత్వం టపాసులు కాల్చకుండా నిషేధం విధించింది. వీలైతే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించాలి.
- ప్రమాదంలో కంటికి గాయమైతే వెంటనే దగ్గరలోని కంటి ఆస్పత్రిని సంప్రదించాలి.

రెవరెండ్ ప్రొ.రాజేశ్వర్ సాల్మన్‌కు డాక్టరేట్



రాంగోపాల్‌పేట్: తెలంగాణ క్రైస్తవ మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారులు, ప్రొఫెసర్, రెవరెండ్ రాజేశ్వర్ సాల్మన్‌కు ప్రయాగ్‌రాజ్‌లోని సామ్ హిగ్గిన్‌బాటం వ్యవసాయ, సాంకేతిక శాస్త్రాల విశ్వవిద్యాలయం (షాట్స్) నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రెవరెండ్ రాజేశ్వర్ సాల్మన్ మెదక్ డయాసిస్‌లోని దక్షిణ భారత చర్చిల్లో పాస్టరల్ కేర్ మినిస్ట్రీస్‌లో పాస్టర్ల కౌన్సిలింగ్ నైపుణ్యాలపై ఒక అంచనా అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ పొందారు. అలాగే ఆయన బిహేవియరల్ థెరపిస్ట్‌గా పోలీసు శాఖ, జైళ్ల శాఖ పలు కౌన్సిలింగ్‌లు అందించారు. అంతేకాకుండా ఆయన కుమార్తె లియో షారోన్ ఇదే విశ్వవిద్యాలయం నుంచి ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేసి పట్టాను అందుకుంది. తండ్రి కుమార్తెలు ఇద్దరూ ఒకే రోజు పట్టాలను అందుకోవడం గమనార్హం.

ఉచిత టపాసుల కిట్ల పంపిణీ



టపాసులు పంపిణీ చేసిన వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: దీపావళి ఆనందాన్ని రెట్టింపు చేసేలా బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ శనివారం సనత్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఉచితంగా టపాసుల బాక్స్‌లను పంపిణీ చేశారు. వివిధ రకాల టపాసులతో కూడిన ప్యాక్‌ను స్థానికులకు అందజేసి ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకొని పండుగ ఆనందాన్ని ఆస్వాదించాలన్నారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ ప్రజలకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

శ్మశానవాటికను పరిశుభ్రం చేయాలి

చిలకలగూడ: సీతాఫల్‌మండి హిందు శ్మశానవాటికను పరిశుభ్రం చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని సామాజిక సేవసమితి అధ్యక్షుడు చందర్ కోరారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని పితృదేవతల ఆత్మ శాంతించేందుకు శ్మశానవాటికలో పలురకాలు పూజలు నిర్వహిస్తారు. సీతాఫల్‌మండి శ్మశానవాటికలో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారిందని, తక్షణమే సంబంధిత అధికారులు, సిబ్బంది స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

సొమ్ము జీహెచ్‌ఎంసీది.. సోకు ప్రైవేట్ వ్యక్తులది

- జీహెచ్‌ఎంసీ వెండింగ్ జోన్‌లో దర్జాగా టపాసుల దుకాణాలు
- తొంగిచూడని అధికారులు..
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు...
- అమ్యామ్యాలు ముట్టడం వల్లనే కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు



వెండింగ్ జోన్‌లోని షాపులను ఆక్రమించి ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలు

సనత్‌నగర్: చిరువ్యాపారుల ఉపాధి కోసం ఒక అడ్డా ఏర్పర్చాలనే సదుద్దేశ్యంతో గత ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి వెండింగ్ జోన్లను ఏర్పాటుచేసింది. సకల వ్యాపారాలు ఒకేచోట ఉంటే అటు కొనుగోలుదారులకు ఇబ్బంది ఉండదనే మరో ఉద్దేశ్యం కూడా ఇందులో దాగి ఉంది. కానీ వెండింగ్ జోన్ల లక్ష్యం ఏమాత్రం నెరవేరకపోగా ప్రైవేట్ వ్యక్తులకు మాత్రం కాసులు కురిపించే కేంద్రాలుగా మారిపోయాయి. అధికారికంగా వీటిని ఎవరికీ కేటాయించలేదు. జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి ఆమోదముద్ర వేయలేదు. కానీ రాజకీయ పలుకుబడితో ఎవరికి వారు వెండింగ్ జోన్‌లోని షాపులను ఆక్రమించేసుకున్నారు. పోనీ వారైనా వ్యాపారాలు చేసుకుంటున్నారా? అంటే వారు మరి కొందరికి అద్దెలకు ఇచ్చుకుంటూ కాసులు దండుకుంటున్నారు. ఈ విషయం జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంపై ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది అన్నట్లుగా వెండింగ్ జోన్లు తయారయ్యాయి. ఈ పరిస్థితి సనత్‌నగర్ ప్రధాన రహదారిలోని ఇండస్ట్రియల్ పార్కును ఆనుకొని ఉన్న వెండింగ్ జోన్‌తో పాటు బల్కంపేట రోడ్డులోని ఆర్అండ్‌బీ కార్యాలయ ప్రహరీని ఆనుకొని ఏర్పాటు చేసిన వెండింగ్ జోన్లలో నెలకొంది. దాదాపు రూ.10 లక్షల వ్యయంతో ఈ రెండుచోట్ల సుమారు 30 షాపుల వరకు నిర్మించారు. వీటిని అర్హులైన చిరువ్యాపారులకు కేటాయించాల్సి ఉంది. వీరి నుంచి ఎలాంటి అద్దెలు వసూలు చేయకుండా వారి ఉపాధికి ఆసరాగా ఉండాలి. కానీ ఇక్కడి షాపులు కొందరు పెద్దల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయి వారి అనుయాయులకు అప్పగించారు. వారైనా వ్యాపారాలు చేస్తున్నారా? అంటే అదీ లేదు. వారు ఇతరులకు అద్దెలకు ఇచ్చుకుంటూ ఆదాయం గడిస్తున్నారు. వాస్తవానికి తోపుడుబండ్లపై వీధివీధినా తిరుగుతూ వ్యాపారం చేసుకునే కూరగాయలు, ఇతరత్రా వ్యాపారాల కోసం వీటిని కేటాయించాల్సి ఉంటుంది. కానీ రాజకీయ పలుకుబడితో ఈ షాపులను దక్కించుకున్న కొందరు చాట్ బండార్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఇతరత్రా వ్యాపారాలకు అనుమతులు నుంచి వారి నుంచి అద్దెలు వసూలు చేస్తుండడం గమనార్హం.

తాజాగా టపాసుల దుకాణదారుల చేతుల్లోకి..

- జీహెచ్‌ఎంసీ ప్రజాధనంతో నిర్మించిన వెండింగ్ జోన్‌లోని షాపులు పూర్తిగా చిరువ్యాపారేతర చేతుల్లోకి వెళ్లిపోయాయని చెప్పడానికి తాజాగా నిర్మించిన టపాసుల దుకాణాలే నిదర్శనం. పూర్తిస్థాయిలో దుకాణాలను ఇప్పుడు బాణాసంచా దుకాణాలకు ఇవ్వడం ద్వారా వెండింగ్ జోన్ల లక్ష్యం పూర్తిగా నీరుగారిపోయింది. టపాసుల దుకాణదారులకు రోజుకు రూ.5–10 వేల చొప్పున వారం రోజుల పాటు విక్రయాలు జరుపుకునేందుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు అద్దెలకు ఇచ్చి దందాకు తెరలేపారు. ఒకరు.. ఇద్దరు కాదు.. షాపులన్నీ ఒకేసారి టపాసుల దుకాణాల నిమిత్తం ఇచ్చేయడంపై అసలు ఇక్కడ వెండింగ్ జోన్ చిరు వ్యాపారుల కోసమా? లేక ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారాలు చేసుకోవడానికా? అన్న అనుమానం కలుగుతోంది.

అధికారుల పర్యవేక్షణ కరువు..

- ఇక్కడ వెండింగ్ జోన్ మాటున అక్రమ దందాలు కొనసాగుతుండడం కళ్లముందే కనిపిస్తున్నా అటు అధికారులు గానీ, ఇటు ప్రజాప్రతినిధులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలకు తావిస్తోంది. షాపులు తమ ఆధీనంలో ఉంచుకొని అద్దెల ద్వారా సొమ్ము చేసుకుంటున్న ఆ ప్రైవేట్ వ్యక్తుల నుంచి అమ్యామ్యాలు అందుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు వెండింగ్ జోన్‌లో షాపులు అర్హులకు అందాయా? లేదా?, ఎలాంటి వ్యాపారాలు చేస్తున్నారు? వెండింగ్ జోన్ల లక్ష్యానికి అనుగుణంగా ఇవి ఉన్నాయా? లేదా? అన్న పర్యవేక్షణ కూడా ఎవరూ చేపట్టకపోవడంపై ఇక్కడి వారు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా కొనసాగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ వెండింగ్ జోన్లపై దృష్టిసారించి వాటి లక్ష్యం నెరవేరేలా చూడాలని కోరుతున్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి సాయిబాబా నామినేషన్



చిలకలగూడ: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కోసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా శనివారం నామినేషన్ దాఖలు చేశారు. సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, ఏఐసీసీ పరిశీలకులు సీపీ జోషిని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నామినేషన్ పత్రాలతో పాటు తన పొలిటికల్, సోషల్ యాక్టివిటీకి సంబంధించిన ప్రొఫైల్‌ను అందించారు. ప్రభుత్వ పనితీరు, ఆరు గ్యారంటీలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి, అందరి సహాయసహకారాలతో క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని నాగులూరి సాయిబాబా వివరించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులకు ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ పరిశీలకుడు సీపీ జోషి హామీ ఇచ్చారని తెలిపారు.

మార్కెట్‌లో దీపావళి సందడి

అమీర్‌పేట: మార్కెట్‌లో దీపావళి పండుగ సందడి నెలకొంది. పండుగను పురష్కరించుకొని పూజలకు ఉపయోగించే వివిధ రకరకాల సామగ్రి అందుబాటులో ఉన్నాయి. అమీర్‌పేట, ఎర్రగడ్డ మార్కెట్‌లు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. ప్రధానంగా మహిళలు దీపారాధనకు ఉపయోగించే అనేక రకాల ప్రతిమలు మార్కెట్‌లో ప్రత్యేక ఆకర్శణగా నిలుస్తున్నాయి. మట్టితో తయారు చేసిన ప్రతిమలతో పాటు వాటికి ప్రకృతి సిద్ధమైన రంగులు వేసి రూపొందించిన రెడీమెడ్ ప్రతిమలను కొనుగులు చేసేందుకు మగువలు ఆసక్తి చూపుతున్నారు. పండుగ రోజున మహాలక్ష్మి అమ్మవారి వద్ద పెట్టే బొంతులు, లక్ష్మీగణపతులు, ఆరు బయట ముగ్గులు వేసేందుకు వీలుగా తయారు చేసిన పలు రకాల చెన్నిలు, చిమ్నీలు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గుమ్మడికాయలు, బంతిపూలు ఎక్కువ ధరలు పలుకుతున్నా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మిఠాయి షాపుల్లో వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి.



కొనుగోలుకు సిద్ధంగా ఉన్న దీపావళి సామగ్రి



పర్యాటక రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొ.పురుషోత్తమ్



గ్లోబల్ టూరిజం అంతర్జాతీయ ముగింపు సదస్సులో బుక్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

లాలాపేట: తెలంగాణ పర్యాటక రంగంలోని సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడంలో స్టార్టప్‌లు, వ్యవస్థాపక సౌకర్యాలు మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొ. పురుషోత్తమ్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'గ్లోబల్ టూరిజం న్యూ అవెన్యూస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. కామర్స్ కాలేజీలోని ఆడిటోరియంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రాంతీయ ఆర్థికవృద్ధికి బాధ్యతాయుతమైన పర్యాటక విధానాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అనంతరం ఈ మూడు రోజుల సదస్సులో చర్చించిన అంశాలపై రూపొందించిన బుక్‌ను ఆవిష్కరించారు. మన దేశం కలిగి ఉన్న సహజ సౌందర్యం, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని మార్కెటింగ్ చేయడంలో కృషి చేయాలని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొ. శ్రీరామ్ వెంకటేష్ అన్నారు. సదస్సు డైరెక్టర్ ప్రొ. చెన్నప్ప మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధిని సాధించడానికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాధించడంలో నాణ్యమైన ప్రచురణలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సులో గ్లోబల్ టూరిజం ప్రమోట్ చేయడానికి చర్చించిన అంశాలపై ఓ నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో టీజీసీహెచ్ఈ కార్యదర్శి ప్రొ శ్రీరామ్ వెంకటేష్, న్యూఢిల్లీ యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ గోపిచంద్, సదస్సు చైర్మన్ ప్రొ. గంగాధర్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ ప్రొ.చెన్నప్ప, కన్వీనర్లు కృష్ణచైతన్య, ఇంద్రకాంతి శేఖర్, ప్యాట్రిక్, వివిధ దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పిల్లర్‌ను ఢీకొట్టిన కంటైనర్

ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్

సనత్‌నగర్: హర్యానా నుంచి మధురై వెళ్తున్న గూడ్స్ కంటైనర్ బేగంపేట పీ అండ్ టీ ఫ్లైఓవర్ పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం ముందు భాగంతో పాటు కంటైనర్ పైభాగం పూర్తిగా దెబ్బతింది. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఎస్ఐ శ్రీధర్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. హర్యానా నుంచి మధురై వెళ్తున్న హెచ్ఆర్ 65 ఏ 1903 భారీ కంటైనర్ సికింద్రాబాద్ వైపు నుంచి బేగంపేట మీదుగా పంజాగుట్ట వైపు వెళ్తుంది. ఉదయం 6 గంటలకు బేగంపేట పీఅండ్‌టీ ఫ్లైఓవర్ వద్దకు రాగానే ఒక్కసారిగా డ్రైవర్ హర్యానా మెవత్ ప్రాంతానికి చెందిన ఉస్మాన్ సాహెబ్‌ఖాన్ (24) వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతూ ఫ్లైఓవర్ పిల్లర్‌ను ఢీకొట్టాడు. దీంతో కంటైనర్ ముందుభాగం బాగా దెబ్బతినడంతో పాటు కంటైనర్ పైభాగం దెబ్బతిని సగం వరకు ఓపెన్ అయ్యి అందులోని పార్శిల్ వస్తువులు కింద పడిపోయాయి. ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు. వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్ ఉస్మాన్ సాహెబ్‌ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరంతర కసరత్తు.. మెలకువలతోనే

క్రికెట్‌లో రాణింపు

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ డైరెక్టర్ కన్వల్‌జిత్‌సింగ్



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ డైరెక్టర్ కన్వల్‌జిత్‌సింగ్

సనత్‌నగర్: చిన్నతనం నుంచే క్రికెట్‌లో నిరంతరం కసరత్తు చేయడం ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ డైరెక్టర్, ఇండియా ఏ జట్టు పూర్వ కెప్టెన్ కన్వల్‌జిత్‌సింగ్ ఆకాంక్షించారు. సనత్‌నగర్‌లోని లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్స్‌లో కోచ్ రాజ్‌కిరణ్ సారథ్యంలో కొనసాగుతున్న జీహెచ్‌ఎంసీ క్రికెట్ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ కొనసాగుతున్న శిక్షణ తీరును పరిశీలించారు. ప్రతిరోజూ శిక్షణ జరుగుతున్న విధానాన్ని, శిక్షణకు అవసరమైన వసతుల గురించి జీహెచ్‌ఎంసీ కోచ్ రాజ్‌కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు క్రికెట్ పాఠాలు చెప్పారు. బౌలింగ్, బ్యాటింగ్‌లో, ఫీల్డింగ్‌పై అవగాహన కల్పించారు. క్రికెట్ శిబిరం కొనసాగుతున్న తీరు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరవుతుండడంపై కోచ్ వారిని అభినందించారు. కార్యక్రమంలో మరో క్రికెట్ కోచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'కథామంజరి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.ప్రత్తిపాక మోహన్, ఉపాధ్యాయ బృందం

బొల్లారం: చదువు అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, మనం పరిశీలించే ప్రతీ విషయం కూడా విద్యలో భాగమేనని డా. ప్రత్తిపాక మోహన్ పేర్కొన్నారు. తిరుమలగిరి లాల్‌బజార్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన కథలను 'కథామంజరి' అనే పుస్తక రూపంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. మోహన్ మాట్లాడుతూ.. చదవడం ఒక అలవాటుగా మార్చుకోవాలన్నారు. విద్యార్థులు విభిన్న రకాల పుస్తకాలు చదివి సొంతంగా రాయడం అభ్యసించాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ఈ దిశగా ప్రోత్సహించాలి అని సూచించారు. డిప్యూటీ ఈన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ వీరలక్ష్మి మాట్లాడుతూ.. పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి కథలు చదవడం చాలా అవసరమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భరద్వాజ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో తెలుగు ఉపాధ్యాయులు డా. ఆర్.కృష్ణమూర్తి, శ్రీనాథశర్మల కృషి అభినందనీయమని అన్నారు. చివరగా శ్రీనాథశర్మ మాట్లాడుతూ రీడ్ ప్రోగ్రాంలో భాగంగా వచ్చిన ఆలోచనతో పిల్లల కథలను సేకరించి 'కథామంజరి' పుస్తకంగా తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కథాసేకరణలో పాల్గొన్న 53 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం పుస్తకావిష్కర్తను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం శాలువాతో, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అదేవిధంగా పూర్వ ప్రధానోపాధ్యాయులు రమణమూర్తి, డీఐఎస్ వీరలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు భరద్వాజలను కూడా సన్మానించారు.

దీపావళి వేడుకల్లో చిన్నారుల సందడి



దీవాళి వేడుకల్లో క్రాకర్స్ కాలుస్తున్న చిన్నారులు

లాలాపేట: దీపావళి పండుగ పర్వదిన వేడుకలను శనివారం తార్నాకలోని పల్లవి కిడ్స్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. దీపావళి పండుగ విశిష్టతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులు టపాకాయలు కాల్చారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పరోమిత రాయ్ చౌదరి, మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్‌కుమార్, పల్లవి గ్రూప్ విద్యా సంస్థల చైర్మన్ ఎం.కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.





హిందూ పబ్లిక్ స్కూల్‌లో దీపావళి సంబరాల్లో చిన్నారులు

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో దీపావళి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'బీసీ' బంద్



కంటోన్మెంట్: జేబీఎస్ వద్ద ధర్నాలో పాల్గొన్న ఎంపీ ఈటల, బోర్డు సభ్యురాలు భానుక నర్మద, బీజేపీ నేతలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బీసీ బంద్ ప్రశాంతంగా విజయవంతం అయింది. పెద్ద ఎత్తున వివిధ విద్యార్థి సంఘాల నేతలు, ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలతో బంద్ మరో తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుకు తెచ్చింది. పలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. – సికింద్రాబాద్/కంటోన్మెంట్/సనత్‌నగర్ జోన్‌బృందం



తార్నాక చౌరస్తాలో అఖిల పక్ష నాయకుల నిరసన



అడ్డగుట్ట బంద్‌లో ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ నేతలు



ఆర్ట్స్ కళాశాల వద్ద మానవ హారం చేస్తున్న దృశ్యం



ఓయూలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



బోయిన్‌పల్లి మార్కెట్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నేతలు



లాలాపేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు



జేబీఎస్ చౌరస్తాలో ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, టీఎన్ తదితరులు



ప్యారడైజ్ చౌరస్తాలో ఆందోళన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు